క్లుప్తంగా

ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం



గోవర్ధన గిరిని సన్మానిస్తున్న ఎస్టీ సెల్ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి

కొయ్యూరు: వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన ఎం.గోవర్ధనగిరిని మంగళవారం ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.వెంకటలక్ష్మి సన్మానించారు. ఆమె మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి గోవర్ధన గిరి చురుకైన పాత్ర పోషించారన్నారు. అతని సేవలు పార్టీకి అవసరమన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ ప్రసాద్ నాయుడు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు



వలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీవో జయసాగర్

జి.మాడుగుల: ప్రజలకు సేవా దృక్పదంతో వాలింటీర్లు పని చేయాలని ఎంపీడీవో లోహిత్ జయసాగర్ తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు సంబంధించి నూతన అభ్యర్థులకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో వివిధ గ్రామాల్లో పలు చోట్ల ఖాళీగా ఉన్న 10 గ్రామ వలంటీర్ పోస్టులకు 37 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఇంటర్వ్యూకు 35 మంది హాజరైనట్టు చెప్పారు. ఆయా వలంటీర్ పోస్టులకు 5మందిని ఇంటర్వ్యూ చేశామన్నారు. త్వరలోనే వలంటీర్లు ఎంపిక చేసి నియమిస్తామన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పెదబయలు: మండలంలోని సీకరి గ్రామంలో గంగదేవత ఆలయ ద్వీతీయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఆవరణలో థింసా, కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు .హుకుంపేట మండలం బాకూరు, శొభకోట, పెదబయలు మండలం గంపరాయి గ్రామాల భజన బృందాలతో భజన పోటీలకు నిర్వహించారు. పోటీల్లో గెలిచిన బృందాలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి గంగదేవత ఆలయ పూజార్లు, లకే కుటుంబీకులు, వైఎస్సార్ రాష్ట్ర ఆగ్రో డైరెక్టర్ వనల్బ సన్యాసి, గ్రామ పెద్దలు స్వామి, వెంకటరమణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా ఉత్సవాలు



కలశాలతో భక్తుల శోభాయాత్ర

అనకాపల్లి : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారి శతజయంతి ఉత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో 108 కలశాలతో శోభాయాత్ర ఆలయం నుంచి ప్రారంభమై మెయిన్‌రోడ్డు గుండా పెరుగుబజారు కూడలి, చిన్నవీధి, మళ్లవరపువారివీధి మీదుగా ఆలయానికి చేరుకుంది. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఊరేగించారు. అడుగడుగునా అమ్మవారికి భక్తులు హారతులు పట్టి దర్శించుకున్నారు. అంతకు ముందు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. సాయంత్రం ఆలయ మండపంలో శ్రీ వింధ్యావాసిని దేవి, శ్రీ నగరేశ్వరస్వామి, శ్రీకోన కమలాదేవి, శ్రీ జనార్దన స్వామి వార్ల కల్యాణం కమనీయంగా జరిగింది. కల్యాణ వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శతజయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే జగనన్న ధ్యేయం



పాతకోట గ్రామస్తులకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

వై.రామవరం: పేదల ఆర్థికాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారని రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని పాతకోట సచివాలయం పరిధిలోని తుమిసెల, పులుసుమామిడిలంక, తంగేడికోట, పాతకోట, పులిమెట్ల గ్రామాల్లో ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి పాల్గొన్నారు. ప్రతీ గ్రామంలోను వారికి ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో గడప గడపను సందర్శించి సంక్షేమ పథకాలు, నవరత్నాలు సక్రమంగా అందాయా లేదా అన్న విషయంపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో సుమారు 450 గడపలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లోని అన్ని సమస్యలు పరిష్కరించడానికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమల్లోకి తీసుకొచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ, ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీలు వీరమళ్ళ సుబ్బలక్ష్మి, సాదాల లక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది, గ్రామ వలంటీర్లు భారీ ఎత్తున పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ రోడ్ షో

మారేడుమిల్లి : జగనన్న ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించడానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పార్టీ నాయకులతో కలిసి బుధవారం మారేడుమిల్లి మండలంలో వైఎస్సార్ వాహన మిత్ర రోడ్ షో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెట్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఉయం 10.30 గంటలకు సున్నంపాడు గ్రామం నుంచి ప్రారంభమైయి, 11.45 గంటలకు జీఎం వలస, మధ్యాహ్నం 2 గంటలకు ఆకుమామిడి కోట 3.30 గంటలకు బోదులూరు, సాయమంత్రం 5 గంటలకు మారేడుమిల్లిలో రోడ్ షో జరుగుతుందన్నారు. ఈ మేరకు మంగళవారం దేవరపల్లి, వాలమూరు, ఉత్తలూరు, ఆకుమామిడికోట కుట్రవాడ పలు గ్రామాల్లో నాయకులు, స్థానికులతో రోడ్‌షో కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రోడ్‌షోను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. జీఎం వలస సర్పంచ్ లక్ష్మి, మండల కో–ఆప్షన్ సభ్యుడు గురకు ధర్మరాజు, వైస్ సర్పంచ్ వీరబాబు, మండల జేసీఎస్ కన్వీనర్ అనిల్ ప్రసాద్ (బాబీ), మండల కార్యదర్శి గంగరాజు, సురేష్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల పర్యవేక్షణ

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి, వై.రామవరం ఏలకల్య పాఠశాలల్లో సీబీఎస్సీ సిలబస్‌తో జరుగుతున్న పది పరీక్షలను మంగళవారం ప్రత్యేకాధికారులు (అబ్జర్వర్స్) పర్యవేక్షించినట్లు ఈఎంఆర్ఎస్ కన్వీనర్ ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. రాజమహేంద్రవరం ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి వచ్చిన సెంటర్ సూపరింటెండెంట్ మృణాళిని వై. రామవరంలో జరుగుతున్న పది పరీక్షలను పర్యవేక్షించారు. అలాగే రాజవొమ్మంగి ఏకలవ్య పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను పెద్దాపురం జవహర్ నవోదయ వైస్ ప్రిన్స్‌పాల్ కె.రామకృష్ణయ్య సెంటర్ సూపరిండెండెంట్‌గా విధుల్లో పాల్గొన్నారు. ప్రిన్స్‌పాల్ ఎంవీ. గోపాలకృష్ణ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



మంజగుడలోలో పర్యటిస్తున్న అరకు అసెంబ్లీ సమన్వయకర్త మత్స్యలింగం

అరకులోయ రూరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని అరకు అసెంబ్లీ సమన్వయకర్త రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలోని చినలబుడు పంచాయతీ పక్కనకుడి, మంజగుడ గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. గ్రామస్తులకు జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. గతంలో ఏ ప్రభుత్వం అమలుచేయలని సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు, జగనన్న ఆశయ సాధనకు అందరూ కృషి చేద్దామన్నారు, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి గెలిపించాలని కోరారు.మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు శత్రుగున్, రాంచందర్, నాయకులు పూర్ణ, రామ్మూర్తి, గురుమూర్తి, వార్డు సభ్యులు హరి, గురుమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హుకుంపేట: మండలంలోని శివారు గ్రామల సైతం అభివృద్ధి పనులు చేపట్టిందుకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎంపీపీ కూడా రాజుబాబు అన్నారు. మండలంలోని దిగుడుపుట్టు జంక్షన్ నుంచి శోభకోట పంచాయతీ మీదుగా పెదబయలు మెయిన్ రోడ్డు గంపరాయి వంతెన వరకు రోడ్డు మరమ్మతు పనులకు ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ నిధులతో కోటి రూపాయల వ్యయంతో పనులు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.జగనన్న ప్రభుత్వం ఏజెన్సీలోని శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి చేస్తుందన్నారు. నాయకులు చిన్నారావు, పంచాయితీ పెద్దలు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని చెన్నంపేట నుంచి పిచుకలపాడు వరకు 750 మీటర్లు గ్రావెల్ రోడ్డు పనులకు ఎంపీపీ కాక కామేశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత మంగళవారం భూమి పూజ చేశారు.ఎంపీపీ నిధులతో మండలంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి బోర్లు, రహదారి పనులు ప్రారంభించనున్నట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి వెంకట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎర్రయ్య, నాయకులు నాగేశ్వరావు, రాంప్రసాద్, వీరాస్వామిముత్తయ్య, వెంకటర్నం, సర్వేశ్వరావు, సుబ్బన్న తదితరులున్నారు.



ఎటపాకలో రహదారి పనులకు పూజలు చేస్తున్న ఎంపీపీ కామేశ్వరి, జెడ్పీటీసీ సుస్మిత



కూనవరంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ప్రజా ప్రతినిధులు



సంపంగిపుట్టులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ రాజుబాబు, నాయకులు

కూనవరం: గ్రావెల్ రోడ్డు నిర్మాణం పనులను సకాలంలో పూర్తిచేయాలని ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ అన్నారు. మండల పరిధిలోని వెంకన్నగూడెం గ్రామం నుంచి చినార్కూరు వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర గ్రావెల్ రోడ్డుకు మంగళవారం సర్పంచ్ సున్నం అభిరామ్ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ఫార్మేషన్, గ్రావెల్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం చినార్కూరు పంచాయతీ సర్పంచ్ సున్నం అభిరామ్ మాట్లాడుతూ చినార్కూరు పంచాయతీ నుంచి 15 ఫైనాన్స్ నిధుల ద్వారా సుమారు రూ. 2లక్షల వ్యయంతో రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. సచివాలయం కన్వీనర్ గొర్రె కన్నయ్య, పంచాయతీ కార్యదర్శి శివ మణికంఠ, విఆర్ఓ ధర్మరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ఉదయ్ ప్రశాంత్, పర్యవేక్షిస్తున్న సర్పంచ్ సుస్మిత



జడేరులోని వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బంది

అరకులోయ రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ ఉదయ్‌ప్రశాంత్ తెలిపారు. మండలంలో పద్మాపురం మేజర్ పంచాయతీ యండపల్లివలస సచివాలయం–2 పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ పెట్టేలి సుస్మిత, వైద్యాధికారి ఉదయ్‌ప్రశాంత్ ప్రారంభించారు, శిబిరంలో 154 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలందరికి వరమన్నారు, గ్రామల్లో ఎటువంటి రోగ లక్షణాలు ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిల్లోనూ వైద్య పరీక్షలు చేసుకోవాలని కోరారు. వైద్యాధికారులు పావనీ, ధరణి, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, సూపర్ వైజర్లు ముత్యలమ్మ, కుమారి, వైద్య సిబ్బంది పాప్పయమ్మ, పూర్ణిమ్మ, పీర్పి, వెంటరమణ, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : జడేరు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 260 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్టు గంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి భావన తెలిపారు. మంగళవారం జడేరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య నిపుణులు కిరణ్, ఆదిలక్ష్మి, కంటి వైద్యులు ఏసుపాదం , 104 , పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది వైద్య సేవలను అందచేశారు.



దూసరపాములో వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న సర్పంచ్ శివ, ప్రజాప్రతినిధులు

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్యశిబిరంలో 152 మందికి వైద్య పరీక్షలు చేశారు.. ఈ శిబిరాన్ని సర్పంచ్ చీడి శివ, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుష్మా మాట్లాడుతూ గ్రామస్తులకు ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించి తగిన చికిత్స, మందులు అందజేసినట్టు చెప్పారు. ఈ శిబిరానికి వచ్చిన మామిడి సంధ్యను పరీక్షించి మెరుగైన వైద్యం కోసం అడ్డతీగల సీహెచ్‌సీకు రిఫర్ చేశామన్నారు. 17 మందికి కంటి పరీక్షలు జరిగాయి. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తామన్నారు. డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహించగా ఎవరికి పాజిటివ్ రాలేదన్నారు. ఆరుగులు గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక వైద్య పరీక్షలు చేశామన్నారు. చిన్నపిల్లల వైద్య నిపుణులు జీవన్, సీహెచ్‌ఓ పద్మావతి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ చీడిపలి ప్రసాద్, 104 డీఈఓ శ్రీనివాస్, ఆశ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సత్కారం

జి.మాడుగుల: మండల కేంద్రంలోని రామాలయం ఆవరణలో బుధవారం మధ్యాహ్నం 2గంటలకు గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్లని మత్స్యకొండంనాయుడు తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే, అరకు పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్త కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని ఆయన అన్నారు. అవార్డులు పొందిన పలువురు వాలింటీర్లకు పురస్కారితను అందజేస్తారని ఆయన చెప్పారు. మండలంలో గల జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, ఏఎంసీ చైర్మన్, బీసీ, డైరెక్టర్లు మండల సచివాలయ కన్వీనర్, మార్కెట్ కమిటీ చైర్మన్, వివిధ నామినేటెడ్ పదవుల్లో ఉన్న నాయకులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు, వార్డు సభ్యులు, గృహసారథులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

హుకుంపేట: ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామ వలంటీర్లకు సన్మానిస్తున్నట్టు ఎంపీడీవో వెంకటరావు చెప్పారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ బుధవారం నిర్వహించే గ్రామ వలంటీర్ల పురస్కారం కార్యక్రమానికి అరకు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెట్టి పాల్గుణ ముఖ్య అతిథిగా పాల్గొని వలంటీర్లను సన్మానిస్తారన్నారు. అందరు గ్రామ వలంటీర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు ప్రారంభం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు



కొయ్యూరులో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహేష్‌రెడ్డి

డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంతబయలు గ్రామంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని మంగళవారం అల్లూరి జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్.రవితేజ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతంలో ప్రజలకు బ్యాంకింగ్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యక్తిగత ఓటీపీ పిన్ నంబర్‌ను ఏ వ్యక్తికి తెలియకుండా గోప్యంగా ఉంచుకోవాలన్నారు.అనంతరం యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ ఈ కేంద్రాల ద్వారా బ్యాంకుల ద్వారా అందించే సేవింగ్ పథకాలు, రుణ పథకాలు, బీమా పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సీఎస్ఎల్ కౌన్సిలర్ శిరిష, కృష్ణకుమారి, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొయ్యూరు మండల కేంద్రంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని మేనేజర్ ఆర్. మహేష్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. గ్రామాల్లో సైతం బ్యాంకు లావాదేవీలపై, బ్యాంకింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయన్నారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ద్వారా ప్రజలకు బ్యాంకులు అందజేస్తున్న బీమా, రుణ తదితర సేవలు అందిస్తున్నామన్నారు.. కౌన్సిలర్లు కిషోర్, లోవరాజు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

రాజవొమ్మంగి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను అయిదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వి.సుబ్రహ్మణ్యం కోరారు. దరఖాస్తుదారులు ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2023–24 ఏడాదిలో 4వ తరగతి చదువు పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. తల్లిదండ్రులు/ సంరక్షకుల ఆదాయం ఏడాదికి లక్ష రూపాయలకు మించకూడదని, ఓసీ, బీసీ విద్యార్థినులు జూన్, 1, 2013 నుంచి జూలై 7, 2015 మధ్య జన్మించిన వారై వుండాని పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీలు అయితే జూన్, 1, 2011 నుంచి జూలై 7, 2015 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోడానికి ఏప్రిల్ 10వ తేదీ వరకు గడువు ఉన్నట్టు చెప్పారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ, ఎస్ఐ లోకేష్‌కుమార్

కొయ్యూరు: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని సీఐ వెంకటరమణ, మంప ఎస్ఐ లోకుష్‌కుమార్ కోరారు. ఎవరు కూడా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. వారు మంగళవారం యూ.చీడిపాలెం పంచాయతీలో రేవులకోట, పలకజీడి, ఎండకోట, గొందికోట గ్రామాలను, ఎం.భీమవరం పంచాయతీలో పుట్టకోట, పెదలంక, కొత్తూరు గ్రామాలను సంరద్శించారు. ఎన్నికల నిబంధనలను గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. రేవులకోట, పీఎల్ కొత్తూరులో పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించారు.

అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలు



అంగన్‌వాడీ సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీడీపీవో విజయకుమారి

కొయ్యూరు: అంగన్‌వాడీ సేవలు పొందుతున్న అంతా విధిగా సేవలు పొందేందుకు వీలుగా వారు బయోమెట్రిక్ వేయాలని సీడీపీవో విజయకుమారి సూచించారు. ఆమె మంగళవారం రొబ్బసింగి, ములగలమెట్ట కేంద్రాలను సందర్శించారు. ఆమె లబ్దిదారులతో మాట్లాడుతూ లబ్దిదారుల వివరాలను యాప్‌లో పొందుపరిచేందుకు వీలుగా వివరాలు అందజేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు విధిగా లబ్దిదారుల వివరాలను తీసుకోవాలని సూచించారు. సమయానికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పోషణ్ సరకులను అందజేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని ఆమె సూచించారు.

ఉన్నత ఫలితాలు సాధించాలి



ఎస్ఎస్ఏ ఎఫ్ఏవో నారాయణరావును సన్మానిస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయ సిబ్బంది

హుకుంపేట: విదార్థులు పరీక్షల్లో ఉన్నత ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలలకు , మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఎస్ఎస్ఏ ఎఫ్ఏవో నారాయణరావు చెప్పారు. స్థానిక కేజీబీవీ వద్ద 10వ తరగతి, ఇంటర్‌ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి, ఇంట చదువుతున్న విద్యార్థులు పరీక్షల్లో భయం వదిల ధైర్యంగా రాయాలన్నారు. పట్టుదలతో చదవి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. అనంతరం ఎఫ్ఏవో నారాయణరావును పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. సమగ్ర శిక్షణ సిబ్బంది ప్రసాదరావు, పాత్రుడు, హెచ్ఎం జయప్రద,సిబ్బంది హాసిన, జ్యోతి, అనంతలక్ష్మి, రత్నకుమారి, చిన్నతల్లి, దివ్య, దేవి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కూలిన రక్షణ గోడలు... ఆందోళనలో వాహనచోదకులు



బొర్రా రోడ్డు రైల్వే గేటు వద్ద కూలిన రక్షణ గోడ

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలకు వెళ్లే మార్గమధ్యలోని రైల్వేగేటు సమీపంలోని రక్షణగోడ కూలిపోవడంతో పెనుప్రమాదంగా మారింది. మిచాంగ్ తుపాను కారణంగా రక్షణగోడ కూలిపోయింది. పర్యాటక కేంద్రామైన బొర్రాగుహలను తిలకించేందుకు పర్యాటకులు ప్రైవేటు బస్సులు, సొంత వాహనాల్లో భారీగా తరలివస్తుంటారు. మలుపువద్ద రక్షణగోడ కూలిపోవడంతో ప్రమాదవశాత్తూ ఏదైనా ప్రమాదం జరిగితే సుమారు 70 నుంచి 80 అడుగుల లోయలోకి వాహనాలు పడిపోయే ప్రమాదం ఉంది. గతంలోని ఓ లారీ బొర్రా వెళ్తుండగా ఇదే ప్రదేశంలోని రక్షణగోడ ఢీకొట్టి కిందలోయలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలోని అదృష్టవశాత్తు డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీశాఖ, రైల్వేశాఖ ఉన్నతాధికారులు స్పందించి రక్షణగోడ నిర్మించాలని కోరుతున్నారు. లేనిపక్షంలో పెనుప్రమాదమే జరిగే అవకాశం ఉందని పర్యాటకులు, వాహనచోదకులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.